ఇంకో చాన్స్ ప్లీజ్..!

- మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని స్థానిక నేతల వినతి
- గ్రేటర్‌లో విలీనం ప్రతిపాదనపై అసంతృప్తి
- బడంగ్‌పేట్, మీర్‌పేట్‌లను కలిపి ఒకే కార్పొరేషన్ చేయాలి
- మొత్తం 20-25 డివిజన్లకు పరిమితం చేయాలని సూచన
- బండి సంజయ్ 'ఉద్యమం' ప్రకటన ఏమైనట్టు..?

సరూర్‌నగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్‌గా ఏర్పడిన తర్వాత కేవలం ఒక్కసారే ఎన్నికలు జరిగిన మీర్‌పేట్, బడంగ్‌పేట్‌లకు మళ్లీ ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాలను ఎన్నుకోవాలని స్థానిక నేతలు కోరుతున్నారు. ఇవి రెండు 2019లో మునిసిపాలిటీల నుంచి కార్పొరేషన్లుగా రూపాంతరం చెంది, అనంతరం 2020లో ఎన్నికలు జరిగి పాలకవర్గాలతో కొలువుదీరిన సంగతి విదితమే! బడంగ్‌పేట్‌ను మొదట 2011లో నగర పంచాయతీగా ఏర్పాటు చేసి, ఆ తర్వాత 2014లో ఎన్నికలు నిర్వహించగా, మీర్‌పేట్‌ను సరూర్‌నగర్ మండల పరిషత్ పాలకవర్గం పదవిలో ఉండగానే 2016లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మునిసిపాలిటీగా ఏర్పాటు చేసి గందరగోళం సృష్టించింది. దాంతో ఓ వైపు మునిసిపల్ అధికారులు, మరోవైపు మండల పరిషత్ పాలకవర్గంతో మీర్‌పేట్‌లో పాలన అస్తవ్యస్తంగా కొనసాగింది. బడంగ్‌పేట్‌కు మాత్రం 2014లో నగర పంచాయతీ ఎన్నికలు నిర్వహించి చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లను ఎన్నుకున్నారు. అదే ఏడాది మీర్‌పేట్, జిల్లెలగూడ, జల్‌పల్లి, పహాడీషరీఫ్, కొత్తపేట, బాలాపూర్‌లోని సగ భాగం(మిగతా సగం భాగాన్ని బడంగ్‌పేట్ నగర పంచాయతీలో కలిపారు) కలిపి అప్పటి సరూర్‌నగర్ మండల పరిషత్‌కు ఎన్నికలు నిర్వహించారు. దాంతో ఎంపీపీ, వైస్ ఎంపీపీతో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు సైతం ఎన్నికయ్యారు. ఆ వెంటనే 2016లో మీర్‌పేట్, జిల్లెలగూడలను కలిపి 'మీర్‌పేట్' పేరుతో ఒక మునిసిపాలిటీని, జల్‌పల్లి, పహాడీషరీఫ్, కొత్తపేట, బాలాపూర్‌లోని సగం భాగాన్ని కలిపి 'జల్‌పల్లి' పేరుతో మరో మునిసిపాలిటీని ఏర్పాటు చేశారు. సదరు రెండు మునిసిపాలిటీలకు అధికారులను సైతం నియమించడంతో అటు అధికారులు, ఇటు మండల పరిషత్ పాలకవర్గాలతో ఆయా మునిసిపాలిటీల్లో గందరగోళ పరిస్థితులు తలెత్తాయి. అదే సమయంలో నగర పంచాయతీగా ఉన్న బడంగ్‌పేట్‌ను సైతం మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశారు.

కార్పొరేషన్‌లుగా మార్చి.. చిన్నచిన్న డివిజన్లు ఏర్పాటు చేసి..

ఇక 2019లో ఈ రెండు మునిసిపాలిటీలను కార్పొరేషన్లుగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపు 1.30లక్షల జనాభా ఉన్న మీర్‌పేట్‌లో 46 డివిజన్లు, 90వేల జనాభా ఉన్న బడంగ్‌పేట్‌లో 32 డివిజన్లు ఏర్పాటు చేశారు. మీర్‌పేట్‌లో కేవలం 1600 నుంచి 1800 మంది ఓటర్లకు ఒక డివిజన్‌ను ఏర్పాటు చేయడం గమనార్హం! ఇక బడంగ్‌పేట్‌లో 2500 నుంచి 2800 మంది ఓటర్లకు ఒక డివిజన్‌ను ఏర్పాటు చేశారు. 2020 జనవరిలో కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించగా రెండు కార్పొరేషన్లలో కొత్త పాలకవర్గాలు కొలువుదీరాయి. సదరు పాలకవర్గాల పదవీకాలం వచ్చే ఏడాది జనవరి 27వ తేదీతో ముగియనుంది.



బడంగ్‌పేట్ కార్యాలయం



మీర్‌పేట్ కార్యాలయం

'గ్రేటర్' ప్రతిపాదనతో నేతల్లో నైరాశ్యం

కార్పొరేషన్లుగా మారిన తర్వాత కేవలం ఒక్కసారే ఎన్నికలు జరిగిన మీర్‌పేట్, బడంగ్‌పేట్‌లతో పాటు సిటీ చుట్టుపక్కల గల ఇతర కార్పొరేషన్లు, మునిసిపాలిటీలను సైతం గ్రేటర్‌లో విలీనం చేయాలని ప్రస్తుత ప్రభుత్వం ప్రతిపాదించడంతో 'స్థానిక' నేతల్లో నైరాశ్యం నెలకొంది. మరోసారి ఎన్నికల్లో పోటీచేసి 'స్థానిక' ప్రజా ప్రతినిధులుగా కొనసాగుదామనుకున్న నాయకులకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మింగుడు పడని అంశంగా మారింది. ఆయా కార్పొరేషన్లలోని పలు కాలనీలు, గ్రామాలు నేటికీ పల్లె వాతావరణంతోనే ఉన్నాయని, వాటిని ఉన్న ఫళంగా గ్రేటర్‌లో కలిపితే ఎలా అని స్థానిక నేతలు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇంకోసారి ఇక్కడ మునిసిపల్ ఎన్నికలు నిర్వహించి కార్పొరేషన్లకు పాలకవర్గాలను ఎన్నుకుంటేనే ఉత్తమమని వారు సూచిస్తున్నారు. ప్రభుత్వం తన నిర్ణయంపై పునరాలోచన చేయాలని కార్పొరేటర్ పదవులపై ఆశలు పెట్టుకున్న అనేక మంది స్థానిక నేతలు కోరుతున్నారు.

రెండు కార్పొరేషన్లను కలిపి ఒకటిగా చేయాలి

మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్లను వేర్వేరుగా కాకుండా రెండింటినీ కలిపి ఒకే కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసి.. ఎక్కువ మంది ఓటర్లతో తక్కువ డివిజన్లుగా విభజిస్తే పాలనకు సౌలభ్యంగా ఉంటుందని ఆయా ప్రాంతాలకు చెందిన పలు రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రెండు కార్పొరేషన్లలో కలిపి 78 డివిజన్లు ఉన్నాయని, వాటిని ఒకే కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసి మొత్తం డివిజన్ల సంఖ్యను 20 నుంచి 25కి పరిమితం చేయాలని వారు సూచిస్తున్నారు. ఈ ఒక్కసారి మళ్లీ ఎన్నికలు నిర్వహించి, వచ్చే ఐదేళ్ల తర్వాత గ్రేటర్‌లో విలీనం చేస్తే బాగుంటుందనే అభిప్రాయం స్థానికంగా వ్యక్తమవుతోంది.

బీజేపీ నేతల ఉద్యమం ఏమైనట్టు..?

బడంగ్‌పేట్, మీర్‌పేట్‌తో పాటు నగర శివారులోని కార్పొరేషన్లు, మునిసిపాలిటీలను గ్రేటర్‌లో విలీనం చేసే ప్రతిపాదనను తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని, దీనిపై తమ పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని గత ఆగస్టులో గుర్రంగూడలో జరిగిన బోనాల వేడుకలకు హాజరైన కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రకటించిన సంగతి విదితమే. గ్రామీణ ప్రాంతాలుగా ఉన్న ఇక్కడి ప్రాంతాలను కార్పొరేషన్లుగా మార్చడమే పెద్ద తప్పు అని, ఇప్పుడు వాటిని ఏకంగా గ్రేటర్‌లో విలీనం చేయాలనుకోవడం మరో తప్పు అని ఆయన వ్యాఖ్యానించారు. కాగా బండి సంజయ్ ఈ ప్రకటన చేసి దాదాపు మూడు నెలలు కావస్తున్నా బీజేపీ నేతల నుంచి ఉద్యమంపై ఎలాంటి స్పందనా కనిపించక పోవడం గమనార్హం! ఇక్కడ ప్రస్తుతం బీజేపీ ఎంపీ ప్రాతినిధ్యం వహిస్తున్న నేపథ్యంలో ఆ పార్టీ ఉద్యమం మొదలుపెడితే ప్రజలు, 'స్థానిక' నేతలు మద్దతుగా నిలిచే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. మరి.. బండి సంజయ్ చెప్పినట్టుగా బీజేపీ ఆ దిశలో అడుగులు వేస్తుందా.. లేక ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికే మౌనంగా తలూపుతుందా? అన్నది వేచి చూడాల్సిందే.

మధుయాష్కీగౌడ్‌ను కలిసిన ఆలయ మాజీ చైర్మన్

చంపాపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నల్ల రఘుమారెడ్డి మంగళవారం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందించారు. కార్యక్రమంలో నాయకులు గూడూరు గౌతంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మధుయాష్కీగౌడ్‌కు బొకే అందజేస్తున్న ఆలయ మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి

మురుగు సమస్య, నీటి కొరత లేకుండా చూస్తాం

మన్సూరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో పొంగి పొర్లుతున్న డ్రైనేజీ మురుగునీటి సమస్యతో పాటు నీటి కొరత లేకుండా శాశ్వత పరిష్కారం చూపుతామని నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్ పేర్కొన్నారు. సీవరేజీ పైప్‌లైన్లలో వ్యర్థాలు తొలగింపు, ఇంటింటా ఇంకుడుగుంత నిర్మాణంలో భాగంగా మంగళవారం అధికారులతో కలిసి పలు కాలనీల్లో ఆమె పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ భూగర్భ జలాలు పెంటడమే లక్ష్యంగా డివిజన్‌లో 90రోజుల పాటు ప్రత్యేక కార్యాచరణను చేపట్టామన్నారు. సీవరేజీ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ చేయడమే ధ్యేయంగా సీవరేజీ పైప్‌లైన్లలో మురుగునీటి వ్యర్థాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌యాదవ్, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఎండీ అశోక్‌రెడ్డి, డైరెక్టర్ స్వామి, సీజీఎం నాగేశ్వర్, జీఎం శ్రీనివాస్‌రెడ్డి, డీజీఎం మాధవి, మేనేజర్ అర్చన, సీవరేజీ సూపర్‌వైజర్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.



కాలనీల్లో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ అరుణాసురేందర్‌యాదవ్

భూగర్భ డ్రైనేజీ, మంచినీటి సౌకర్యం కల్పించాలి

వనస్థలిపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): శివారు కాలనీలకు భూగర్భ డ్రైనేజీ, మంచినీటి సౌకర్యం కల్పించాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం వనస్థలిపురంలోని జలమండలి కార్యాలయంలో బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శివారు కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డికి కార్పొరేటర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని శివారు కాలనీలకు భూగర్భ డ్రైనేజీ మంచినీటి వ్యవస్థ లేకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంత కాలంగా సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు అందజేసినా ఎలాంటి ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా కాలనీవాసుల ఇబ్బందులను గుర్తించి భూగర్భ డ్రైనేజీ, మంచినీటి వసతులను కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిచో కాలనీవాసులతో కలిసి జలమండలి కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం రాజ్‌గోపాల్, పలు కాలనీల అధ్యక్షులు నందకిషోర్, శ్రీశైలం, చిత్రంజన్, సత్యనారాయణ, యాదిరెడ్డి, రమేష్‌కుమార్ పాల్గొన్నారు.



జలమండలి జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, కాలనీవాసులు

లారీ ఢీకొని ఆటోమొబైల్ మెకానిక్ మృతి

హయత్‌నగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నడుచుకుంటు వెళ్తున్న ఆటో మొబైల్ మెకానిక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేట్‌కు చెందిన ఇమ్మడి సత్యనారాయణ(50) ఆటోమొబైల్ మెకానిక్. మంగళవారం ఉదయం మెకానిక్ షెడ్డుకు వెళ్లేందుకు జాతీయ రహదారి 65పై రోడ్డు పక్క నుంచి నడుచుకుంటు వెళ్తున్నాడు. పెద్దఅంబర్‌పేట్ ఏ-1 బేకరి వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ అతడిని ఢీకొట్టింది. దీంతో సత్యనారాయణ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సత్యనారాయణ మృతదేహం

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

హయత్‌నగర్ : పెద్ద అంబర్‌పేట్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం హయత్‌నగర్ పోలీసులు స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేట్‌లో మహేంద్రా రోడ్ వేస్ ఎదురుగా గుర్తు తెలియని 50 సంవత్సరాలు గల వ్యక్తి చనిపోయి పడి ఉన్నాడు. ఇది గమనించిన మహేంద్రా రోడ్ వేస్ యజమాని రవీందర్‌రెడ్డి 100కు ఫోన్ కాల్ చేశారు. దీంతో హయత్‌నగర్ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడికి ఎడమ చెయ్యి లేదు. కుడి చెయ్యి మాత్రమే ఉంది. మృతుడి వంటిపైన బ్లూ రంగు టీషర్టు, బ్లాక్ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడు. సుమారు 5 ఫీట్ల ఎత్తు ఉన్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి సంబంధించిన వారు ఎవరైన ఉంటే హయత్‌నగర్ పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడికి జైలు, జరిమానా


రంగారెడ్డి కోర్టులు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బంధువైన బాలికను అపహరించుకెళ్లి పెళ్లి చేసుకుని లైంగికదాడికి పాల్పడిన నిందితునికి పోక్సో కోర్టు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి నష్టపరిహారం చెల్లించాలని తీర్పు చెప్పింది. పీపీ సునీతబర్ల కథనం ప్రకారం.. వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే అనిల్ కుమార్తె వరుస అయిన ఓ బాలికను అపహరించుకుని వెళ్లి పెళ్లి చేసుకుని ఆపై బలవంతంగా లైంగికదాడికి పాల్పడ్డాడు. దీంతో బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన పోలీసులు సాక్ష్యాధారాలతో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎం.కె.పద్మావతి నిందితుడికి పది సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 15వేలు జరిమానా విధించి బాధితురాలికి రూ. 10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారు.

ట్రేడ్ లైసెన్సు లేని వ్యాపారాలను గుర్తించేందుకు 2 ప్రత్యేక టీంలు

- లైసెన్సు లేకుండా వ్యాపారం నిర్వహిస్తే కఠిన చర్యలు
- కమిషనర్ రవీందర్‌రెడ్డి హెచ్చరిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ట్రేడ్ లైసెన్సు లేకుండా వ్యాపారం నిర్వహిస్తే మున్సిపల్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలో ట్రేడ్ లైసెన్సు లేకుండా కొనసాగుతున్న అక్రమ వ్యాపార సముదాయాలపై పెద్దఅంబర్‌పేట్‌లో 'ట్యాక్స్ ఫ్రీ' వ్యాపారం అనే శీర్షికతో ఆంధ్రజ్యోతి దిన పత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రెవెన్యూ, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో ట్రేడ్ లైసెన్సు తీసుకోకుండా నిర్వహిస్తున్న అక్రమ వ్యాపార సముదాయాలను గుర్తించేందుకు రెవెన్యూ అధికారులు, బిల్ కలెక్టర్లతో కలిసి 2 టీంలను ఏర్పాటు చేశారు. రెండు టీంలలో 19 మంది పని చేస్తారని కమిషనర్ తెలిపారు. ప్రతి రోజు రెండు టీంలు మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వ్యాపార సముదాయాల వద్దకు వెళ్లి ట్రేడ్ లైసెన్సు ఉన్నదా.. లేదా తనిఖీ చేస్తారని తెలిపారు. వ్యాపార లైసెన్సు లేకపోతే వెంటనే తీసుకునేలా చర్యలు చేపడతారని తెలిపారు. తప్పని సరిగా ట్రేడ్ లైసెన్సు తీసుకోవాలని ఆ తర్వాతనే వ్యాపారం చేసుకోవాలని కమిషనర్ సూచించారు.



మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్స్, బిల్ కలెక్టర్లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కమిషనర్ రవీందర్‌రెడ్డి

స్థానిక సంస్థల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సమగ్ర కులగణన జరిపి స్థానిక సంస్థల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర డిమాండ్ చేశారు. ప్రముఖ రచయిత, సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ రచించిన మా వాటా మాకే అనే పుస్తకాన్ని మంగళవారం సీనియర్ న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలతో కలిసి రంగారెడ్డి జిల్లా కోర్టుల ఆవరణలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ చేసిన కామారెడ్డి డిక్లరేషన్‌లో అధికారంలోకి వస్తే కులగణన జరిపి బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం వెంటనే సమగ్ర కులగణన జరిపి బీసీ రిజర్వేషన్లను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. సీనియర్ న్యాయవాది సదానందం మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి బీసీలకు అన్యాయమే జరుగుతూ వస్తున్నదన్నారు. ఇప్పటికైనా బీసీలకు న్యాయం చేయాలని కోరారు. బార్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి దేవరాజు మాట్లాడుతూ రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డిలు ఎన్నికల ముందు బీసీలకు న్యాయం చేస్తామని మాట ఇచ్చారని రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినందున ఇక జాప్యం చేయకుండా వెంటనే బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు భిక్షమయ్య, ఆంజనేయులుగౌడ్, నర్సింగ్‌రావు కళ్యాణ్‌కార్, కృష్ణాగౌడ్, పాండు, సత్యనారాయణ రెడ్డి, జయప్రసాద్, కిషన్, రమేష్‌యాదవ్, వెంకటకృష్ణ, శివకుమార్‌గౌడ్, ప్రభాకర్ పాల్గొన్నారు.



రంగారెడ్డి జిల్లా కోర్టుల ఆవరణలో మా వాటా మాకే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర, ఇతర న్యాయవాదులు

అదుపుతప్పి కారు బోల్తా..

- నలుగురికి స్వల్ప గాయాలు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నగర శివారు నాగోల్ నుంచి గౌరెల్లి రేడియల్ రోడ్డులో వెళ్తున్న కారు కుంట్లూర్ పరిధిలోని జీవీఆర్‌కాలనీ మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో నలుగురు వ్యక్తులు ఉన్నట్లు తెలిసింది. కారులోని ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో అందులోని వ్యక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వెంటనే వారిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదకర మలుపు..

రేడియల్ రోడ్డులోని కుంట్లూర్ జీవీఆర్‌కాలనీ సమీపంలోని కుత్బుల్లాపూర్ గ్రామానికి వెళ్లే దారి వద్ద మలుపు ప్రమాదకరంగా తయారయింది. గతంలో ఇక్కడ పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. మలుపు వద్ద రోడ్డు వెడల్పు చేయడంతో పాటు స్టాపర్‌లను ఏర్పాటు చేయాలని కుత్బుల్లాపూర్‌కు చెందిన వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చెలిమండ్ల గోవర్దన్ కోరారు. దీనిపై ట్రాఫిక్, లాఅండ్ ఆర్డర్ పోలీసులు దృష్టిపెట్టాలన్నారు.



బోల్తా పడిన కారు

ఖాళీ స్థలాల్లో చెత్త తొలగించనందుకు జరిమానా

చాదర్‌ఘాట్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్ డివిజన్‌లోని సంజీవయ్యనగర్ బస్తీలోని రెండు చోట్ల పేరుకుపోయిన చెత్తను తొలగించనందుకు జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 శానిటేషన్ విభాగం రూ.లక్ష జరిమానా విధించింది. సంజీవయ్యనగర్ బస్తీలోని బాగ్ మూసారాంబాగ్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల పక్కనున్న ఖాళీ స్థలంలో, దీన్ని ఆనుకుని సుమారు 1300 చదరపు గజాల ఖాళీ స్థలంలో చెత్త పేరుకుపోవడంతో పాటు మొక్కలు అడ్డదిడ్డంగా పెరిగాయి. దీంతో బస్తీవాసులకు పాములబెడద సమస్య తలెత్తింది. ఖాళీ స్థలం అందులోను చెత్త కుప్పలు, చెట్ల పొదల్లో జనసంచారం లేని కారణంగా పాములకు నిలయంగా మారింది. బస్తీవాసుల వినతి మేరకు మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 శానిటేషన్ విభాగం ఏఎంహెచ్‌వో అనురాధకు చేసిన ఫిర్యాదు మేరకు పారిశుధ్య సిబ్బంది కదిలింది. ఆ రెండు ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించనందుకు ఒక్కొక్కరికి రూ.50వేల చొప్పున జరిమానా విధించినట్లు ఏఎంహెచ్‌వో తెలిపారు.



చెత్త తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి, ఏఎంహెచ్‌వో అనురాధ

నేటి నుంచి చెత్త తొలగింపు పనులు

చెత్త తొలగింపు పనులు బుధవారం నుంచి మొదలు కానున్నాయి. 1300 చదరపు గజాల స్థల యజమాని ముఖేష్‌కు విధించిన రూ.50 వేలను చెక్కు రూపంలో కార్పొరేటర్ సమక్షంలో ఏఎంహెచ్‌వోకు అందజేశారు. బస్తీలో ప్రభుత్వ పాఠశాల పక్కనున్న మరో ఖాళీ స్థలం యజమాని నాగరాజు రూ.50వేల జరిమానా చెల్లించాల్సి ఉంది. బుధవారం వాటిని వసూలు చేస్తామని ఆమె తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

హయత్‌నగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కమ్మగూడకు చెందిన నలుగురు వ్యక్తులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు అయిన చెక్కులను మంగళవారం తుర్కయంజాల్ మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి, 22వ వార్డు కౌన్సిలర్ కోశిక ఐలయ్యతో కలిసి అందజేశారు. కమ్మగూడ సుభాష్‌నగర్ కాలనీకి చెందిన రేణుమల నాగేశ్వరరావుకు, రూ. 51 వేయి, శ్రీశ్రీనగర్ కాలనీకి చెందిన గోరుకంటి యాదగిరికి రూ. 32,500, కమ్మగూడ సుభాష్‌నగర్ కాలనీకి చెందిన రేండ్ల రవిదాసుకు రూ. 24వేలు, కమ్మగూడ ఏపీఏటీ కాలనీకి చెందిన ఎస్. లక్ష్మణ్‌కు రూ. 11వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కమ్మగూడ మాజీ సర్పంచ్ వలిగె బాబు, రాజునాయక్, రాముగౌడ్, రాజు, శివ, గంగాధర్, ప్రశాంత్ పాల్గొన్నారు.



చెక్కును బాధితుడికి అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ రాంరెడ్డి, కౌన్సిలర్ కోశిక ఐలయ్య

ప్రో కబడ్డీ క్రీడాకారులకు ఉప్పల ఫౌండేషన్ చేయూత

మన్సూరాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అండర్-14 విభాగంలో ప్రో కబడ్డీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన నాగోల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉప్పల ఫౌండేషన్ చేయూతనందించింది. ఈ మేరకు క్రీడాకారులకు మంగళవారం టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్, ఇంటర్నేషనల్ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో క్రీడా దుస్తులతో పాటు షూస్‌ని అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ విద్యార్థులు తమలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు తమవంతు సహకారం ఎప్పటికీ ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికకావడం పట్ల విద్యార్థులతో పాటు పాఠశాల సిబ్బందిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఏసీపీ నరేష్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, పీఈటీ శంకర్, మమత, వెంకటేష్, రవికుమార్, జయప్రద, మాధవి, విమల పాల్గొన్నారు.



ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అందించిన దుస్తులతో క్రీడాకారులు

ఆశ్రమంలో పిల్లలకు ఉచిత హేర్‌కటింగ్

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని పెద్దఅంబర్‌పేట్‌లోని చిల్డ్రన్ ఆఫ్ డెక్కన్ ఫౌండేషన్ ఆశ్రమంలోని పిల్లలకు కర్పూరి ఠాకూర్ సామాజిక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు అశ్విని ఆంజనేయులు మంగళవారం ఉచిత హేర్ కటింగ్ చేసి సామాజిక సేవా భావాన్ని చాటుకున్నాడు. ఈ సందర్భంగా ఆశ్రమంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంజనేయులు మాట్లాడుతూ సామాజికసేవ కార్యక్రమంలో భాగంగా ప్రతి మంగళవారం అనాథ ఆశ్రమాల్లో ఉచితంగా హేర్ కటింగ్ చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ మల్కన్న, వినయ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



ఆశ్రమంలోని పిల్లలకు ఉచిత హేర్‌కటింగ్ చేస్తున్న ఆంజనేయులు

పాదయాత్రతో శబరిమలకు గురుస్వాములు

చంపాపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ బైరామల్‌గూడ డిఫెన్స్‌కాలనీలోని హరిహరక్షేత్రం అయ్యప్ప స్వామి ఆలయం నుంచి శబరిమలకు బయలుదేరిన గురుస్వాముల పాదయాత్రను మంగళవారం ఆలయ వ్యవస్థాపకులు, చంపాపేట డివిజన్ కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ మహాపాదయాత్ర ఆలయం నుంచి బయలుదేరి గురుస్వాములు శబరిమలకు చేరుకుంటారని అన్నారు. మాలధారణ చేసి మణికంఠుడి దర్శనం కోసం వెళ్తున్న స్వాముల పాదయాత్ర విజయవంతం కావాలని కార్పొరేటర్ అయ్యప్పస్వామిని ప్రార్థించారు. కార్యక్రమంలో గురుస్వాములు రాజశేఖర్‌రెడ్డి, సునిల్‌కుమార్, మోహన్, ఆంజనేయులు, విజయ్, సురేష్, మనిష్ పాల్గొన్నారు.



హరిహరక్షేత్రం అయ్యప్పస్వామి ఆలయం వద్ద గురుస్వాముల మహాపాదయాత్రను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి